మీరు ఎక్కడ నిలబడాలని అనుకుంటున్నారో ఆ స్థలానికి కెమెరాని గురిచూసి....

కెమెరాని కదలకుండా ఉండేటట్లు పెట్టి ....ఈ సెల్ఫ్ టైమర్‌బటన్ నొక్కి మీరు ఆ ప్రదేశంలోకి వెళ్ళి నిలబడితే పదిసెకన్ల తరువాత కెమెరా క్లిక్ మంటుంది.....మీరుఫోటో తియ్యబడతారు....' అన్నాడు రాంబాబు.

'ఒకసారి మీదగ్గర ట్రై చెయ్యనా?' అని అడిగింది ఆమె.

'ఓ .... దాందేముందీ...తప్పకుండా ...' అని అంటూ నవ్వుతున్న కిష్టయ్యవంక చూసి నోరుమోసుకున్నాడు రాంబాబు.

ఆమె కెమేరాని టేబుల్‌మీద ఉంచి వ్యూ ఫైండర్‌లోంచి చూస్తూఎదురుగోడకి ఎయిమ్‌చేసి సెల్ఫ్ టైమర్ నొక్కి తను గబగబ వెళ్ళి గోడ దగ్గర నిలబడింది.

ఒకటి ...రెండు ...మూడూ.... సెకన్‌లు గడుస్తున్నాయ్...

ముగ్గురూ ఆతృతతగా ఎదురుచూస్తున్నరు.

నాలుగు... అయిదు ...

ఆమె ముఖం వంక చూసిన రాంబాబు ఆశ్చర్యపోయాడు. ఆమె కళ్ళు మూసుకుని ఉంది. శ్రీరం కాస్త ఊగుతుంది.

ఆరు....ఏడు ...ఆనిమిది....

ఓమైగాడ్ ! ....ఆమె పడిపోతుంది. మూర్ఛ పోతుంది...

రాంబాబు పరిగెత్తుకు వెళ్ళి ఆమె కిందపడిపోకుండా రెండు చేతులు ఆమె చుట్టూవేసి పట్టుకున్నాడు.

...తొమ్మిది...పది...

కెమెరా క్లిక్ మంది ...

## *ఫ్రేమ్ - 3*

### *ఆమె ఎవరు ?*

రాంబాబు ఆమెని మెల్లగా నేలమీద పడుకోబెట్టాడు.

'ఏవిటండీ గురూగారూ ఏమైంది?' అన్నాడు కిష్టయ్య ముందుకు పరుగెత్తుకువచ్చి మోకాళ్ళమీద కూర్చుంటూ.

'కనబడ్డంలేదూ....లోపలినుండి నీళ్ళు తీసుకురా...'

కిష్టయ్య లోపలనుండి గ్లాసుతో నీళ్ళు తెచ్చాడు. రాంబాబు కిష్టయ్యచేతిలోంచి గ్లాసు అందుకుని ఆమె ముఖం మీద కాస్త నీళ్ళు చిలకరించాడు.

ఆమెలో కాస్త చలనం కలిగింది.

రాంబాబు మరికాస్త నీళ్ళు చిలకరించాడు ఆమె ముఖం మీద.

ఆమె కనురెప్పలు కదిలాయ్....చిరుగాలికి చిటారుకొమ్మనచిగురుటాకుల్లా....

మెల్లమెల్లగా కళ్ళు తెరిచింది. రెప్పలు ఒక్కసారి అల్లల్లాడించి కళ్ళు విప్పారించి చూసింది.

చటుక్కున లేచికూర్చుని చీరకుచ్చిళ్ళు పాదాలమీదికి లాక్కుంది.

'ఎలా ఉందండీ?...' అన్నాడు రాంబాబు.

'నాకేమైంది?' ఆమె ఎదురు ప్రశ్న వేసింది.

'మీరు కళ్ళుతిరిగి పడిపోయారు....ఇప్పుడెలా వుంది?'

'ఫరవాలేదు...'

'చల్లని నీళ్ళు కాస్తతాగండి ....' కిష్టయ్య నీళ్ళగ్లాసు అందిస్తూ అన్నాడు.

ఆమె సగం గ్లాసు తాగించి అతి నాజూగ్గా...గ్లాసుని పక్కన పెట్టిలేచి నిలబడి కాస్త తూలింది.

'ప్లీజ్....కాస్సేపు కూర్చుని వెళ్ళండి...' అన్నాడు రాంబాబు.

ఆ కుర్చీలో కూర్చుని వెళ్ళండి....' అన్నాడు రాంబాబు.

ఆమె కుర్చీలో కూర్చుంది. 'థాంక్స్....'

ఆమె గొంతు నూతిలోంచి వచ్చినట్లు ఉంది.

'మీ ఆరోగ్యం బాగోలేదా?' అన్నాడు రాంబాబు ఆమె ఎదురుగా కూర్చుంటూ.

'అవునండీ.... వారం రోజుల నుండీ జ్వరం ... నిన్న ఉదయమే నార్మల్‌కి వచ్చింది...ఈ వారం రోజుల్నుండీ నేనేమీ తినలేదు... అందుకే నీరసం వల్లకళ్ళు తిరిగాయ్....' అంది ఆమె.

'తిరిగే ఓపిక వచ్చేవరకూ బయటకి రాకుండా ఉండాల్సింది...'

'వారం రోజుల్నుండీ ఇంట్లో ఉండడంవల్లచాల బోరు కొట్టిందండీ.... అందుకే బయటకి వచ్చాను...సారీ ...మీకు చాల శ్రమ ఇచ్చాను ...నేనింక వస్తానండీ...'

'ఉండండి....కాస్త వేడివేడి  కాఫీ తాగి వెళుదురు గాని....ఒరేయ్ కిష్టయ్య...ప్లాస్కు తీసుకెళ్ళి కాఫీ పట్టుకు రారా....'

'అబ్బే.... వద్దండీ...థాంక్యూ. నేనింక వెళతాను...'అంటూ లేచి నిలబడి కాస్త ముందుకు తూలింది ఆమె.

'ఎందుకన్నా మంచిది ....మీ కభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను....'

'వద్దండీ.... ఇప్పటికే మీకు చాలాశ్రమ ఇచ్చాను ...వస్తానండీ....'

'పోనీ నా అసిస్టెంటుని తోడిచ్చి పంపిస్తాను....'

'అక్కర్లేదండీ...థాంక్యూ...వస్తాను.....' అని కెమేరా తీసుకుని మెల్లగా అడుగులేసుకుంటూ ఆమె బయటకి వెళ్ళింది. ఆవైపుగా వెళుతున్న ఖాళీ ఆటోవచ్చి ఆమె ముందు ఆగింది. ఆమె

ఆటో ఎక్కింది. ఆటో రివ్వున ముందుకు దూకింది.

కొన్ని క్షణాలు రాంబాబు, కిష్టయ్య మౌనంగా ఉండిపోయారు.

రాంబాబు దీర్ఘంగా నిట్టూర్చాడు.

కిష్టయ్య అంతకంటే దీర్ఘంగా నిట్టూర్చాడు.

'ఎంత అందంగా ఉందండీ గురూగారూ...'

'అవున్రా....చాల అందంగా ఉంది...'

'పేరేమిటండి....'

'ఏమోరా నేను అడగలేదు....'

'అడ్రసు?'

'అదీ అడగలేదు...'

'ఏంటండీ గురూగారూ... అంత అందమైన అమ్మాయిది పేరూ, అడ్రసూ ఏమీ కనుక్కోలేదు మీరు......'

'మనకెందుకురా....'

'మొత్తానికి భలే ఛాన్సుకొట్టారండీ గురూగారూ....'

'ఏం?'

'ఆ అమ్మాయిని గట్టిగా పట్టుకుని ...'

'తప్పురా....ఆ అమ్మాయికి పెళ్ళయింది....మెళ్ళో మంగళసూత్రాలు చూళ్ళేదా?'

'అవును గురూగారూ!' కిష్టయ్య చెంపలేసుకున్నాడు.

'ఆ అమ్మాయిని గురించి మర్చిపో...' అన్నాడు రాంబాబు.

కిష్టయ్య తల ఊగించి మళ్ళీచెంపలేసుకున్నాడు.

ఆ అమ్మాయిని మర్చిపో అని రాంబాబు అన్నాడేగానీ ఆ అమ్మాయిని జన్మజన్మలకీ మర్చిపోలేని  సంఘటనలు ముందు ముందు తనకు జరుగుతాయని ఆ క్షణంలో రాంబాబుకి తెలియదు.

రాత్రి ఎనిమిదిన్నర గంటలయింది.

'ఇంక వెళదామా?' అన్నాడు కిష్టయ్య.

'నే నెప్పుడో రెడీ...' అన్నాడు కిష్టయ్య.

రాంబాబు డ్రాయర్ సొరుగుతాళం వేసి లేచాడు.

### గ్రేట్ ఎస్కేప్

వాళ్ళిద్దరి గుండెలూ వేగంగా కొట్టుకుంటున్నాయ్..నొసలు మీద అరిచేతుల్లో చెమట ఊరుతూంది. పాదాలు చల్లబడిపోయాయ్... ఎంత వేగంగా నడ్వాలన్నాకుదరటంలేదు. కాళ్ళు

తడబడుతున్నాయ్. దానికితోడు మాటిమాటికి చీర కుచ్చెళ్ళు పాదాలకి అడ్డు తగులుతున్నాయ్.

భయంతో ఆ ఇద్దరమ్మాయిల ముఖం పాలిపోయింది.

'ఛీఛి....దరిద్రం సినిమా... పాడు సినిమా....' అంది ఆ ఇద్దరిలో ఒక అమ్మాయి. ఆ అమ్మాయి పేరు సరోజ. ఇప్పటికి అలా ఎన్నిసారుల అందో...

'ఎన్నిసార్లు తిడతావ్....' అంది రెండో అమ్మాయి లక్ష్మి.

'అయినా ఆ సెక్స్ బాంబ్ హీరోయిన్‌గా వేసిన సినిమాకి వద్దే అంటే విన్నావ్?...ఛీఛీ.... ఏం డాన్సులవి?.... ఈలలు , కేకలూ ....ఒకటే గోల...'

'కానీ అదంటే నాకు చాల ఇష్టమే ...నేను దాన్ని ధేన్ని...' అంది లక్ష్మి.

'రేండోసారి వెస్సు ఆ సినిమాకి....ఛీఛీ....థియేటర్ మొత్తం మీద మనిద్దరం తప్ప అసలు ఆడాళ్ళు ఎవరయినా వచ్చారా..అసలు ఆ డాన్సులు ఎలా చూశావే....ఒకటే గోల.... అరుపులు ...దానికి తోడు వెనక నుండి మీద చేతులు బెయ్యడం...జడలాగడం... కాళ్ళతో నొక్కడం ....ఛీ...వెధవలు...' సరోజ ఛీదరించుకంది.

'సారినే ....సినిమా బాగుంటుందేమో అని తీసుకోచ్చాడు....' అంది లక్ష్మి.

వెనక ఆ వెధవ ఇంకా ఫాలో అవుతున్నాడా?...'

'ఏమో ...'

'కాస్త చూడు....'

'బాబోయ్ ...నాకు భయం ....' అంది లక్ష్మి గుండెలమీద చేతులు వేసింది....కాస్త చూడవే....' అంది సరోజ.

'అమ్మో..నువ్వేచూడు....'

సరోజ మెల్లగా తల తిప్పిచూసి.

అతను పళ్ళికిలించాడు సరోజను చూసి

వీళ్ళకి పదిగజాల దూరంలో ఫాలో అవుతున్నాడు అతను. అడ్డచారలు బనీను వేసుకున్నాడు. అడ్డంగా బలసి ఉన్నాడు. రిగులు రింగులుగా దుబ్బులా ఉన్న జుట్టు, కారా కిళ్ళీతో గారపట్టిన పళ్ళు ... చూడగానే ఇంప్రషన్ పడిపోతుంది....

'వెధవ ఇంకా ఫాలో అవుతున్నాడే ...ఏమనుకుంటున్నాడోసలు .... వాడి అందం చూసి మోహించేస్తా మనుకుంటున్నాడేమో....వెధవ... అసలీ వెధవలంతా ఏమనుకుంటారో....'

'మన మ్యాటినీచూసి వస్తున్నాం కాబట్టి సరిపోయింది... అదే ఫష్టో అయితే చీకట్లో ఇంకా భయంవేసేది....'అంది లక్ష్మి మెల్లగా వెనక్కి చూస్తూ.

అడ్డచారల బనీనువాడు గారపళ్ళు బయటపడి కన్నుకొట్టాడు. వాడు తన నడక వేగం కాస్త పెంచాడు.

'అమ్మో....వాడు త్వరత్వరగా మన దగ్గరగా వచ్చేస్తున్నాడే...నాకు భయంగా ఉంది....' అంది లక్ష్మి ఏడుపు ముఖంపెట్టి.

'కాస్త త్వరగా నడువ్....' సరోజ విసుక్కుంది.

'దరిద్రం సినిమాకి వెళదాం అని చంపుకుతిన్నావ్...అనుభవించు.'

'కాలేజీలో అబ్బాయిలు నువ్వంటే హడలి చచ్చేవాళ్ళు కదే....ఇప్పుడేంటీ ఇలా భయపడుతున్నావ్....నువ్వే ఏమైనా చెయ్యాలి...'

కాలేజిలో అబ్బాయిలు వేరు....ఈ రౌడీ వెధవ వేరు...'

లక్ష్మి మెల్లగా మళ్ళీ వెనక్కి చూసింది. ఆమె గుండె గుభేల్‌మంది.

'అమ్మో చాలా దగ్గరకి వచ్చేశాడే....' అంది సరోజ అరచేతిని పట్టుకుని నొక్కుతూ.

వెనకనుండి ఈల వినిపించింది ....'ఏయ్ అమ్మాయ్ ....మేడమ్....పిలుస్తున్నాడు అడ్డచారల బనీనువాడు.

'లాభం లేదు...ఏమైనా చెయ్యాలి....' అనుకుంది సరోజ.

ఆమెకి మెరుపులా ఆలోచన తట్టింది.

ఎదురుగా వస్తున్న ఒక మధ్యవయస్కుడిని ఆపింది.

'ఏవిటి బాబాయ్....ఇలా ఎటు వెళ్తున్నావ్?....' అంది సరోజతని దారికి అడ్డుగా నడుస్తూ.

అతను తెల్లబోయి సరోజవంక చూశాడు.

'బావున్నావా బాబాయ్....' అంది సరోజ  తనే మళ్ళీ అంటూ.

'బాగున్నానుగానీ .... మీరూ!!....' అతను ఇంకా ఏదో అనబోయాడు.

'పిన్ని ఎలాగుంది బాబాయ్...' అతన్ని మాట్లాడనీయకుండా తనే అంది. అలా అడుగుతూ క్రీగంట చూసింది. ఆ అడ్డాచారల బనీనువాడు కాస్త దూరంలో ఎలక్ట్రిక్ పోల్‌కి ఆనుకుని రెండుచేతులూ కట్టుకుని ఇటే చూస్తున్నాడు.

'పిన్నా?.... అదిపోయి రెండేళ్ళు అయ్యింది కదా.... ఇంతకీ నువ్వూ....నువ్వెవరివో నాకు తెలీదు...'

'ష్...నెమ్మదిగా....వాడు వింటాడు' అంది సరోజ.

'వాడా...ఎవడు?'

'అదిగో...అటుపక్కన ఎలక్ట్రిక్ పోల్‌కు అనుకుని ఉన్నాడే వాడు....'

ఆయన తలతిప్పి చూశాడు. ఆ అడ్డచారల బనీనువాడు చటుక్కున తల అటుపక్కకి తిప్పేసి ఎటో చూసున్నట్టు నటించాడు.

'ఇంతకీ ఎవడువాడు?'

సరోజ తనూ లక్ష్మి సినిమాకి వెళ్ళడం అడ్డచారల బనీనువాడు తమ వెనక సీట్లో కూర్చుని అల్లరిపెట్టడం....సినిమా అయిన తరువాత వెంట బడడం అన్నీచెప్పింది.

'మీరు పరిచయం ఉన్నవాళ్ళలా మాట్లాడితేవాడు వెళ్ళిపోతాడని ....' అంది లక్ష్మి.

‘ఓహో... అదా సంగతి...’ మెల్లగా అని పక్కకి తిరిగి చూశాడు. అడ్డచారల బనీనువాడు మళ్ళీ తలకాయ్ అటుపక్కకి తిప్పేశాడు.

‘మీ పిన్నా ?.... బాగుందమ్మా...నువ్వు బొత్తిగా మా ఇంటికి రావడం మానేశావేం.... అది నిన్ను ఒకటే కలవరిస్తూంది’ అన్నాడు అతను సరోజ భుజాలమీద చేతులు వేస్తూ.

‘ఎక్కడ బాబాయ్... అసలు తీరికే దొరకలేదు....ఈ ఆదివారం వస్తాను....’

‘ఆదివారం ఎందుకూ ఇప్పుడు రాకూడదూ?’

‘ఇప్పుడు కుదరదులే బాబాయ్....’

లక్ష్మి సంతోషంతో అంది ‘వాడు వెళ్ళిపోతున్నాడు....’

సరోజ తలతిప్పి చూసింది.

‘అడ్డచారల బనీనువాడు తలవొంచుకుని గబగబా అడుగులు వేసుకుంటూ వచ్చినదారే వెళ్ళిపోతున్నాడు.

‘చెప్పు....మా ఇంటికి ఇప్పుడే వస్తావుకదూ?’ అన్నాడు ఇవేమీ పట్టనట్టు ఆయన సరోజ భుజాలు పట్టి కుదుపుతూ.

‘వాడు వెళ్ళిపోయాడులెండి....’ అంది సరోజ అతనితో.

‘వాడు వెళ్ళిపోవడానికి మా ఇంటికిరావడానికీ సంబంధం ఏముంది?....మా ఇంటికి రండి....కాస్సేపు ఉండీ వేళ్ళిపోదురుగాని .... ఇంట్లో ఎవరు లేరు....’

సరోజ భుజాలమీద ఆయన చేతులు బిగుసుకున్నాయ్.

సరోజ ఆయనవంక తీక్షణంగా చూసింది. ఆయన వెకిలిగానవ్వాడు....

‘వస్తావా....’

సరోజ అతని చేతుల్ని భుజాలమీంచి లాగి విసిరికొట్టింది.

‘బుద్ధిలేదూ...నీకు నా అంత కూతుర్లు ఉండిఉంటారు....’

‘నీ అంత కూతురు ఉందిగానీ...నీ అంత పెళ్ళామే లేదు మరి....ప్చ్....’ అన్నాడు మెలికలు తిరిగిపోతూ.

‘రావే లక్ష్మి....ఈముసలి వెధవతో మనకేంటి....’

‘మా ఇంటికి వస్తే తెలుస్తుంది నేను ముసలాడినో పడుచోడినో....’ వాళ్ళవెనకే ఫాలో అవుతూ అన్నాడు.’

‘మా వెనకే వస్తావేం?.....’ అంది సరోజ మండిపడుతూ.

‘ఇది నీ రోడ్డా?...నా ఇష్టం వచ్చినచోటికి నేను వెళతాను....’